

# 24న విద్యాసంస్థల బంద్

## విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పిలుపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన వైఫల్యాలు,పేపర్ లీకేజీలు,పరీక్షల వ్యవస్థలో అవకతవకలకు నిరసనగా ఈనెల24న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు ఎఐఎస్‌ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యుఐ, పిడిఎస్‌యు, ఎఐఎఫ్‌డిఎస్, ఎఐఎస్‌బి, ఎఐపిఎస్‌యులతో కూడిన విద్యార్థి సంఘాల ఐక్యవేదిక పిలునిచ్చింది. బంద్‌ను విజయవంతం చేయడానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, మేధావులు, ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేసింది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు, ఎన్ఎస్‌యుఐ నాయకుడు వెంకట్ స్వామి, ఎఐఎఫ్‌డిఎస్ నాయకుడు పల్లె మురళి పాల్గొని బంద్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన వరుస వైఫల్యాలకు కేంద్ర ప్రభుత్వం పూర్తి బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలోఎఐఎస్‌ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్, ఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, పిడిఎస్‌యు నాయకుడు శ్రీను పాల్గొన్నారు.



**యువజన సంఘాల మద్దతు**

24న విద్యార్థి సంఘాలు చేపట్టనున్న విద్యాసంస్థల బంద్‌కు యువజన సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. బుధవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించాయి. ఈ కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్, డివైఎఫ్ఐ రాష్ట్ర నాయకులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కృష్ణతో పాటు సత్య ప్రసాద్, జావీద్, హస్మీ, దేవేందర్, కె. కిరణ్, రాజు, కార్తీక్, సుధాకర్ పాల్గొన్నారు.

# పిటిషన్లు, అప్పీళ్ల నిష్పాక్షిక విచారణకు జిఎస్‌టి ట్రిబ్యునల్ హామీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** జిఎస్‌టి కేసులకు సంబంధించి పిటిషన్లు లేదా అప్పీళ్ల నిష్పాక్షిక విచారణకు జిఎస్‌టి ట్రిబ్యునల్ హామీ ఇస్తుందని తెలంగాణ జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్ న్యాయమూర్తి జస్టిస్ సుశీల్ కుమార్ శర్మ చెప్పారు. హైదరాబాద్ లక్డికాపూల్‌లోని ఎఫ్‌టిసిసిఐ ఆడిటోరియంలో బుధవారం ఛార్టర్డ్ అకౌంటెంట్‌లు, పన్ను న్యాయవాదులకు 'ఓపెన్ ఫోరమ్ విత్ జిఎస్‌టి అప్పిలేట్ ట్రిబ్యునల్' కార్యక్రమాన్ని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ట్యాక్స్ బార్ అసోసియేషన్ నిర్వహించింది. ఈ ఓపెన్ ఫోరంలో న్యాయమూర్తి జస్టిస్ సుశీల్ కుమార్ శర్మ తోపాటు ట్రిబ్యునల్ న్యాయ సభ్యులు ఎ.పి.రవి, సాంకేతిక సభ్యులు డాక్టర్ డి.కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కార్మిక హక్కుల సాధనకు

# ఐక్య పోరాటాలే మార్గం

## ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.యూసుఫ్







**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మిక హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గమని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వ శాఖల్లో శాశ్వత ఉద్యోగాల స్థానంలో కాంట్రాక్ట్ విధానాన్ని ప్రోత్సహించడం ఆందోళనకరమని, కాంట్రాక్ట్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా మార్చాలనే డిమాండ్ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎఐటియుసి హైదరాబాద్ జిల్లా 18వ మహాసభలు బుధవారం ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయం(సత్యనారాయణరెడ్డి భవన్)లో ఘనంగా నిర్వహించారు. తొలుత నారాయణగూడ చౌరస్తా నుంచి ఎఐటియుసి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం కార్యాలయం ముందు ఎఐటియుసి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి.యూసుఫ్, ఎం.నరసింహా, కమతం యాదగిరి, ఎం.ఎస్.మూర్తి, బొడ్డుపల్లి కిషన్, పి. వెంకటయ్య, హసీనా బేగం, లక్ష్మి, మల్లేశ్వర రావు, కొంరెల్లి బాబు, రమేష్ , సిహెచ్. శ్రీనివాస్, సబ్బు రాజమౌళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎండి.యూసుఫ్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు కార్మికులకు కనీస వేతనాలను రూ.20 వేలకు పెంచాల్సిన అవసరం ఉన్నప్పటికీ రూ.16 వేలకే పరిమితం చేశారని ఆరోపించారు. కనీస వేతనాల కమిటీలో సభ్యులుగా వివిధ కేటగిరీల కార్మికులకు రూ.20 వేల నుంచి రూ.28 వేల వరకు వేతనాలు నిర్ణయించాలని సిఫార్సులు చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. మున్సిపల్, భవన నిర్మాణ కార్మికులతో పాటు అన్ని శాఖల కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి ఉద్యమాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్ మహాసభల్లో భవిష్యత్ పోరాట కార్యాచరణను నిర్ణయిస్తామని తెలిపారు. ఎఐటియుసి నగర కమిటీ పిలుపునిచ్చే అన్ని పోరాట కార్యక్రమాల్లో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఎం.నరసింహా మాట్లాడుతూ కార్మికుల హక్కులను పరిరక్షించుకోవాలంటే దేశవ్యాప్తంగా కార్మిక వర్గమంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ వల్ల భవిష్యత్తులో కార్మిక సంక్షేమ బోర్డులు, కార్మిక చట్టాలు బలహీనపడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల ఉద్యమాల నేపథ్యంలో కేంద్రం గతంలో కొన్ని చట్టాలను వెనక్కి తీసుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ, ప్రస్తుతం కూడా పలు వర్గాలు తమ హక్కుల కోసం ఆందోళనలు చేస్తున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలు కార్మికుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని, ఎనిమిది గంటల పనివిధానాన్ని 12 గంటలకు పెంచే ప్రయత్నాలు కార్మికులపై తీవ్ర ప్రభావం చూపుతాయని విమర్శించారు. దేశంలో తొలి కార్మిక సంఘమైన ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మిక వర్గమంతా ఐక్యంగా పోరాడి తమ హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు.

# దాశరథి స్ఫూర్తి నేటి సమాజానికి అవసరం

## బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సిఎం కె.చంద్రశేఖర్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ అస్తిత్వం ప్రమాదంలో పడిన నేపథ్యంలో తెలంగాణ ఆత్మగౌరవం, అస్తిత్వ పరిరక్షణ కోసం రాజులనే ఎదిరించిన కలం వీరుడు దాశరథి కృష్ణమాచార్యులు అందించిన స్ఫూర్తి నేటి తెలంగాణ సమాజానికి అవసరమని బిఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. దాశరథి అందించిన తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ స్ఫూర్తిని కొనసాగిస్తామన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తన కలాన్ని గళాన్ని వినిపించిన కవి రచయిత దాశరథి కృష్ణమాచార్యుల జయంతి సందర్భంగా కెసిఆర్ బుధవారం నివాళులు అర్పించారు. జైలు గోడల నడుమ బంధీ అయినప్పటికీ .'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అంటూ గర్జించిన తెలంగాణ అస్తిత్వ పరిరక్షణ సమర యోధుడు దాశరథి అని కేసీఆర్ కొనియాడారు. కృష్ణమాచార్యుల త్యాగాలను, తెలంగాణ అస్తిత్వం కోసం చేసిన సాహితీ పోరాట కృషిని గుర్తించి, నాటి బి ఆర్ ఎస్ ప్రభుత్వం దాశరథి జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ, ఆయన పేరుతో సాహితీ పురస్కారాన్ని నెలకొల్పిందన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యల

# పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

## కార్మిక శాఖ మంత్రి వివేక్‌కు ఎఐటియుసి వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జిఓ నంబర్6 అమలైతే మున్సిపల్ కార్మికులకు అన్యాయం జరుగుతుందని, ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, ఇతర మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అమలవుతున్న వేతనాల కంటే జిఓలో పేర్కొన్న వేతనాలు తక్కువగా ఉన్నాయని తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షుడు కె. ఏసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు వారు బుధవారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామిని సచివాలయంలో కలిసి మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల వేతనాల పెంపుదల అంశాన్ని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్చిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతో కార్మికులకు వేతనాల పెంపు ప్రయోజనం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం యూనియన్ నాయకులతో చర్చలు నిర్వహించాలని కార్మిక శాఖ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్మిక శాఖ పరిధిలోని అంశాలపై లా సెక్రటరీ పాపిరెడ్డితో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించినట్లు వెల్లడించారు.



# అర్హులను ఓటరు జాబితా నుంచి తొలగించకుండా చూడాలి

## పార్టీ శ్రేణులకు కెటిఆర్ సూచన

**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాష్ట్రంలో లక్షల మంది ఓటర్ల పూర్తి వివరాలు అందుబాటులో లేకపోవడంతో, వారిలో చాలామందిని నోటీసులు జారీ చేసే విభాగంలో చేర్చారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. అలాంటి ఓటర్లకు నోటీసులు అందిన వెంటనే వారికి అవసరమైన మార్గనిర్దేశం చేసి, అర్హులైన వారి పేర్లు ఓటరు జాబితా నుంచి తొలగకుండా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. బిఆర్‌ఎస్ ఎస్ఐఆర్ కార్యక్రమాల పర్యవేక్షణ కమిటీతో బుధవారం హైదరాబాద్,నందినగర్‌లోని తన నివాసంలో కెటిఆర్ సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ ఆధ్వర్యంలోని కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతున్న ఎస్ఐఆర్ కార్యక్రమాల పురోగతిని, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను కెటిఆర్‌కు వివరించింది. ఓటరు జాబితా ప్రక్రియలో అర్హులైన ఒక్క ఓటరు కూడా తప్పకూడదని,అదే సమయంలో డూప్లికేట్ లేదా అనర్హ ఓటర్లు జాబితాలో ఉండకుండా చూడాలని స్పష్టం చేశారు. ఆగస్టు 3వ తేదీ వరకు బిఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో నిమగ్నమవ్వాలని సూచించారు.



# ఆర్టిజన్ ఉద్యోగుల భారీ ధర్నా

## దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యుత్ పంపిణీ సంస్థలలో (టిజిఎస్‌పిడిసిఎల్, టిజిఎన్‌పిడిసిఎల్) పనిచేస్తున్న ఆర్టిజన్ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జెఎసి) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లోని టిజిఎస్‌పిడిసిఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిర్వహించిన భారీ ధర్నా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మొత్తం 9 అనుబంధ సంఘాల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ నిరసన కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి వేలాది మంది ఆర్టిజన్ కార్మికులు తరలివచ్చారు. లంచ్ అవర్ ధర్నాగా ప్రారంభమైన ఈ నిరసనలో ఆర్టిజన్ల నినాదాలతో మింట్ కాంపౌండ్ ప్రాంగణం హోరెత్తింది. యాజమాన్యం ఎస్మా ఆంక్షలు విధించినప్పటికీ, కార్మికులు భారీ సంఖ్యలో పాల్గొని తమ ఆక్రోశాన్ని వెలిబుచ్చారు. విద్యార్హత ఆధారిత కన్వర్షన్: అర్హత కలిగిన ఆర్టిజన్లకు వారి విద్యా స్థాయికి తగిన ఉద్యోగ హోదాలను (కన్వర్షన్) కల్పించాలని, ఆర్టిజన్లందరికీ నిబంధనల ప్రకారం సర్వీస్ రూల్స్‌ను పూర్తిస్థాయిలో వర్తింపజేయాలని, డిస్కమ్‌లలో అన్‌మ్యాన్డ్ కార్మికులుగా సేవలందిస్తున్న ఉద్యోగులను ఆర్టిజన్లుగా గుర్తించి క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. 2016 డిసెంబర్ 4 కంటే ముందు నుంచి పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ విలీనం చేసుకోవాలని, పీస్ రేట్ వర్కర్లకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనాలు చెల్లించడంతో పాటు 2026 పిఆర్‌సి సిఫార్సులను వెంటనే అమలు చేయాలని కోరారు. సభలో విద్యుత్ ఆర్టిజన్స్ జెఎసి కన్వీనర్ ఎస్. శైలు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇచ్చిన హామీల మేరకు మూడు నెలల కింద సమ్మెను విరమించామని, కానీ నెలలు గడుస్తున్నా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఆర్టిజన్లను కేవలం శ్రమ దోపిడీకి గురిచేయకుండా, వారి విద్యార్హతలకు తగిన గుర్తింపు ఇవ్వాలని, యాజమాన్యం బెదిరింపు ధోరణి వీడి, వెంటనే స్పందించకపోతే రానున్న రోజుల్లో ఆందోళనలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

**శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానము**
వెలిమినేడు గ్రామం, చిట్యాల మండలము, నల్లగొండ జిల్లా.

లేఖ నెం.13/SAST/2026, టెండర్ - కం - బహిరంగ వేలముల ప్రకటన తేది: 22.07.2026

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన బహిరంగ వేలము ది:29.07.2026 బుధవారము రోజున ఉ.11.00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరము | డిపాజిట్ డి.డి / నగదు | కాలపరిమితి |
|---|---|---|---|
| 1. | కొబ్బరికాయలు, పూజాసామాగ్రి, లడ్డూ, పులిహోర ప్రసాదములు & కొబ్బరి చిప్పలు సేకరించుకొను హక్కు | 2,00,000/- | 01.08.2026 నుండి 31.07.2027 వరకు (1 సం॥) |

కావున పైన తెలిపిన టెండర్ - కం - బహిరంగ వేలం నిర్వహించుటకు ఒక గంట ముందు ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనగలరని కోరనైనది. ఇతర వివరములకు మొబైల్ నెంబర్ **9703662667** సంప్రదించగలరు.

ఇట్లు, సిరికొండ నవీన్
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 6478-PP/CL/ADVT/2026-27, Date: 22-07-2026

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి.
మెయిల్: sew.ghmc@gmail.com, సెల్ నెం. 9154172331

'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు

NIT.No: 33/SE/SLPZ/CMC/2026-27 Date: 22.07.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ / ECV | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| NIT.No: 33/ SE/SLPZ/ CMC/2026-27 Date: 22.07.2026 | సిఎంసి, ఎస్ఎల్‌పిజెడ్, ఎంథొమోలజీ వింగ్ & అమీన్‌పూర్ సర్కిల్-47లో సిసి రోడ్డు నిర్మాణం మరియు అదనంగా 21 మంది కూలీల వినియోగం. | రూ. 117.92 లక్షలు | 23.07.2026 మ.1:00గం.లకు, 30.07.2026 మ.1:30గం.ల వరకు | ఎస్ఇ, ఎస్ఎల్‌పిజెడ్, సిఎంసి. సెల్ నెం. 9154172331 |

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, శేరిలింగంపల్లి జోన్ : సిఎంసి

DIPR R.O. No. : 6523-PP/CL/ADVT/2026-27, Date: 22-07-2026



## యువతకు విదేశీ ఉద్యోగాల దిశగా

# టామ్‌కామ్ కీలక అడుగు

## కెరీర్ కన్సల్ట్జ‌తో అవగాహన ఒప్పందం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ యువతకు నైతిక, పారదర్శక, సుస్థిర విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), కెరీర్ కన్సల్ట్జ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంఓయు) ప్రతిని రాష్ట్ర కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు, గనుల శాఖ మంత్రి, టామ్‌కామ్ చైర్మన్ డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి బుధవారం అధికారికంగా అందజేశారు. టామ్‌కామ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎ.నిర్మల కాంతి వెస్లీ, కెరీర్ కన్సల్ట్జ సిఇఓ మేనేని రోహిత్ రావు మధ్య కుదిరిన ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ యువతకు అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను విస్తరించే వ్యూహాత్మక భాగస్వామ్యానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు.

